8

# జీవితపు పరిస్థితులను సద్వినియోగం చేసికొనుట

## (ప్రసంగి 3; 4)

జీవితం అంటే ఏమిటి? అని తెలుసుకుని, నిజమైన సంతోషము పొందడమే సొలొమోను అంతిమ లక్ష్యం. సంతోషమును, జీవితపు నెరవేర్పును కనుగొనడానికి తన జీవిత కాలమంతా పరిశీలించి చూచిన దానిని ప్రసంగిలో అతడు రివ్యూ చేశాడు. నరులు తమ్మును తాము సంతోషముగాను, సంతుష్టిగాను చేసికొనడానికి సాధారణంగా చేసే ప్రయోగాలన్నింటిని సొలొమోను చేసి చూసాడు. దానిలో ఏదియు తనకు తీరని సంతుష్టి కలిగించలేదు (లేక శాశ్వతమైన సంతుష్టిని కలిగించలేదు).

సొలొమోను ఉదహరించినట్టు నిజమైన సంతోషము దానికొరకు వెతికితే దొరకదు. తన పరిశోధనలవలన అతడు ఏ తీర్మానాలకు వచ్చి చేరుకున్నాడో, మనము వాటిని నేర్చుకోవాలని దేవుడు కోరుకుంటున్నాడు. ఈ సత్యాలను మనం వర్తింపజేసుకున్నట్టయితే, మన బ్రతుకులను సరిగా ఉపయోగించుకునేలా అవి మనకు తోడ్పడతాయి. సంతుష్టి సహితమైన జీవితాలను జీవించడానికి 3, 4 అధ్యాయాలలో మనకు కొన్ని ఉపదేశాలు యివ్వబడ్డాయి. నిశ్చయంగా మనకు కష్టాలు ఎదురౌతాయి, అయితే అవి మన జీవితంలోని సంతోషాన్ని లయపరచనవసరం లేదు. జీవిత పరిస్థితులను మనం బాగుగా సద్వినియోగం చేసికొన నేర్చుకొన్నట్టయితే, మనం సంతోషముగాను, సంతుష్టిగాను, సమాధానంగాను జీవించుతూ, జీవితపు తుఫానులు ఎదురైనప్పుడు వాటిని నిమ్మళింప జేయడానికి వీలుంటుంది. తుఫానులు మన చుట్టు రేగకుండ నిలుపలేము, కాని మనలో అవి రేగకుండ చూచుకోగలం.

నిజమైన సంతోషము నేర్చుకునేదేగాని దొరికేది కాదని దీని భావమా? దీన్ని గూర్చి సొలొమోను ఏమి చెప్పబూనాడో చూద్దాం.

### జీవితపు పరిస్థితులను మేలుగా మలుచుకొనడంవలన నిజమైన సంతోషం వస్తుంది (3:1-22)

దేవుడు తన మహా కనికరములో ప్రతిదానికి సమయాన్ని ఏర్పరచాడు: "ప్రతిదానికి సమయము కలదు. ఆకాశము క్రింది ప్రతి ప్రయత్నమునకు సమయము కలదు" (3:1). ఈ సత్యాన్ని ఉదహరించడానికి గాను పధ్నాలుగు పరస్పర భిన్నములైన జతలను ఉపయోగించాడు:

పుట్టుటకు, చచ్చుటకు;
నాటుటకు నాటబడినదాని పెరికివేయుటకు;
చంపుటకు బాగుచేయుటకు;
పడగొట్టుటకు కట్టుటకు;
ఏడ్చుటకు నవ్వుటకు;
దుఃఖించుటకు నాట్యమాడుటకు;
రాళ్లను పారవేయుటకు రాళ్లను కుప్పవేయుటకు;
కౌగిలించుటకు కౌగిలించుట మానుటకు;
వెదకుటకు పోగొట్టుకొనుటకు;
దాచుటకు పారవేయుటకు;
చింపుటకు కుట్టుటకు;
మౌనముగా నుండుటకు మాటలాడుటకు;
ప్రేమించుటకు ద్వేషించుటకు;
యుద్ధము చేయుటకు సమాధానపడుటకు (3:2-8).

ఈ సంఘటనలలో అనేకమైన వాటిమీద మనకు ఎక్కువ ఆధిపత్యముండదు. ఎప్పుడు సమయం వస్తుందో అప్పుడు పుట్టుక జరుగుతుంది, అలాగే మరణం కూడ. తగిన కాలంలోనే మనం నాటాలి, రుతువులను తొందర చేయలేం. పంట సిద్ధమైనప్పుడే మనం కోత కోస్తాం. కొన్ని సందర్భాల్లో ఏడుస్తాం, మరికొన్ని సందర్భాల్లో మనం నవ్వగలం కూడ. కట్టడం పడగొట్టే సమయముంటుంది, తిరిగి కట్టే సమయం కూడ వస్తుంది.

అనేక అంశాలను చుట్టుకొంటూ ఈ పోలిక కొనసాగుతుంది. ఏడ్వడానికి నవ్వడానికి సమయముంది. దుఃఖించడానికి నాట్యమాడడానికి సమయముంది. వ్యవసాయకుడు తన పొలంలోనుండి రాళ్లు తీసివేయగోరినప్పుడు, వాటిని పారవేసే సమయముంది. ఒకడు యిల్లు కట్టగోరాడా, రాళ్లను సమకూర్చే సమయం అదైయుంటుంది. చింపడానికి సమయ ముంటుంది, చింపిన దానిని కుట్టే సమయముంటుంది. మాట్లాడదగిన సమయముంటుంది. మౌనంగా ఉండే సమయమూ ఉంది. కొన్ని ప్రేమించబడుచుండగా, మరికొన్ని ద్వేషించబడాలి, కొన్నిసార్లు యుద్ధాలు చేయాలి; యితర సమయాల్లో సమాధాన పడాలి.

ఇదంతా మనకిచ్చే అర్థమేమి? "ప్రసంగి" మనకు చెప్పదలచుకొన్నదేమి? కొన్ని సంఘటనలు తక్కిన వాటన్నిటికంటె ఎక్కువ యిష్టంగా ఉంటాయి, అయితే అన్నియు వాటివాటి కాలంలో జరుగుతాయి. మంచి చెడ్డలతో కూడిన జీవితపు పరిస్థితులన్నియు మనం అంగీకరింప నేర్చుకోవాలని సొలొమోను అంటున్నాడా? లేక జీవితంలో పాజిటివ్ నెగటివ్‌ల బేలన్సు, కౌంటర్ బేలన్సును కేవలం గమనించుతూ ఉన్నాడా? "నేను ఎందుకు ఓటు వేయడానికి తొందరపడాలి? నేను దానికి వ్యతిరేకంగా ఓటు వేస్తాను, నా భార్య దానికి అనుకూలంగా ఓటు వేస్తుంది. మా ఓట్లు ఒకదానినొకటి రద్దు చేస్తాయి" అన్న ఒకనిలా సొలొమోను జీవితంవైపు చూస్తూ ఉండవచ్చు. జీవితపు రాబడులు బకాయిలు, దేవుడు లేకుంటే జీరో అన్నట్టు సొలొమోను ఒకవేళ ఉదాహరిస్తుండవచ్చు.

3:9లో అతడు యిలా అడిగాడు, "కష్టపడిన వారికి తమ కష్టమువలన వచ్చిన లాభమేమి?" జీవితం పాజిటివ్ నెగటివ్‌ల పరంపరలైయుండి వాటిమీద నరునికి ఏ స్వాధీనం లేదు. మానవ దృష్టిలో, కాలములు సమయములు వాటి చక్రాలను పూర్తి

చేస్తూ, ఆ చక్రాలలోగుండ కొనిపోవడం నిష్ప్రయోజనం కావచ్చు. మన వశములోలేని పరిస్థితులను కేవలం మనం అంగీకరించి, వాటిని మనకు అనుగ్రహించిన దేవుని సేవించుటకు ప్రస్తుత జీవితంలో వాటిని మనం వినియోగించాలి.

ప్లాను ప్రకారమే జీవితపు పరిస్థితులన్నీ కలిసి పనిచేస్తాయి (3:10–15). దేవుని కరుణాహస్తము చేత నరజాతి మీద పెట్టబడిన కష్టానుభవాన్ని "ప్రసంగి" చూచాడు. "నరులు అభ్యాసము పొందవలెనని దేవుడు వారికి పెట్టియున్న కష్టానుభవమును నేను చూచితిని. దేనికాలమందు అది చక్కగా ఉండునట్లు సమస్తమును ఆయన నియమించి యున్నాడు" అని ప్రసంగి పలికాడు (3:10, 11ఎ). తన కాలములో జరుగునట్లు దేవుడు సమస్తమును నియమించియున్నాడు. మనం చూచేవాటికంటే జీవితపు సంఘటనలు మించినవై ఉన్నట్టు మనం ఎరిగేలా మానవ హృదయంలో ఈ ఆలోచన ఆయన పెట్టాడు. మనం యింకను యిలా చదువుతాం, "శాశ్వత కాల జ్ఞానమును నరుల హృదయ మందుంచియున్నాడుగాని దేవుడు చేసిన క్రియలను పరిశీలనగా తెలిసికొనుటకు అది చాలదు" (3:11బి). నిత్య దేవుడు సమస్తాన్ని తన అదుపులో ఉంచుకుంటాడు, అయితే ఆ పటాన్ని అంతటిని – ఆరంభంనుండి అంతంవరకు చూడలేం. మనం బిగింపబడియున్న కాల పరిమాణంలో ఉన్న సంగతులనే చూడగలం.

గనుక, భూమిమీద జీవించే దినాల్లో నరుడు చేయగల శ్రేష్ఠమైన సంగతి ఏమంటే – తన కష్టార్జితమువలన సుఖము అనుభవించడమేనని సొలొమోను తీర్మానించాడు: "కావున సంతోషముగా నుండుటకంటెను తమ బ్రదుకును సుఖముగా వెళ్లబుచ్చుట కంటెను, శ్రేష్ఠమైనదేదియు నరులకు లేదని నేను తెలిసికొంటిని. మరియు ప్రతివాడు అన్న పానములు పుచ్చుకొనుచు తన కష్టార్జితమువలన సుఖమనుభవించుట దేవుడిచ్చు బహుమానమే అని తెలిసికొంటిని" (3:12, 13). నేడు అనే బహుమానాన్ని దేవుడు దాని అవకాశాలతోను, సవాలులతోను మనకిచ్చియున్నాడు. మనము దేవుని నమూనాను మార్చలేం; దానితో ఏమీ కలుపలేము సరిగదా, అందులోనుండి ఏదియు తీసివేయలేము (3:14). అది మనకు అర్థం కాకపోయినా (3:14), మన జీవితాలకొరకు మనము దేవుని చిత్తాన్ని అంగీకరించి ఆయనయందు నమ్మికయుంచాలి.

దుష్టత్వము, అన్యాయం సహా ఒక ఉద్దేశంకొరకు ఉపయోగించుకొనబడవచ్చు (3:16–22). న్యాయం కొరకు సొలొమోను తేరి చూచినప్పుడు, దుష్టత్వము అక్కడ చోటుచేసికొంటున్నట్టు అతడు చూచాడు. నీతి ఉండవలసిన చోట అక్రమము అతనికి కన్పించింది. నీతిమంతునికిని, దుష్టునికిని దేవుడు తీర్పు తీర్చునని తమకు తెలుసు, కాని దుష్టత్వానికి ఎందుకు చోటు యివ్వబడిందో అతడు తెలిసికోగోరాడు, పాపంలో జీవించేవారు మృగములకంటె ఉత్తములు కారని ప్రజలకు తెలపడానికి దేవుడు దానిని ఉండనిచ్చినట్టు అతడు అభిప్రాయపడ్డాడు.

దేవుని ప్రసన్నతను అలక్ష్యం చేసి, ప్రజలు జంతువులవలె జీవించినప్పుడు, జంతువుల కంటె ఎక్కువైన నిరీక్షణగాని, వారి జీవితాలకు ఉద్దేశంగాని వారికి లేదు. దుష్టత్వంలో జీవించే నరుడు మృగముకంటె ఎందులో ఎక్కువ? మృగమును, తానును మట్టిపాలగుదురు గదా?

నరుడు చేయగల అతి శ్రేష్ఠమైనదేమంటే – తన పనియందు సంతుష్టి చెంది, జీవితంలో తన పాలును అంగీకరించడమేననే తీర్మానానికి తిరిగి సొలొమోను వచ్చి చేరుకున్నాడు. ఈ లోకంలో గుండా మనం ఒక్కసారే దాటిపోతాం. ఆయన యిచ్చిన రూపంలో దేవుడు మనకు ఏది అనుగ్రహించాడో దానిని మనం ఉపయోగించుకోవాలి.

## నిజమైన ఆనందం మానవుడు రూపించేది కాదు (4:1-16)

తన సొంత సంతుష్టిని నరుడు రూపుదిద్దలేడు – అనేక పరిస్థితులు దానిని లయపరచవచ్చు. సంతుష్టిగా ఉండే మానవ ప్రయాసను అణచివేత లయం చేయవచ్చు (4:1–3). లోకంలో అణచివేయబడుతున్న జనులను గూర్చి ఆలోచించు. వారు దుఃఖం చేత కన్నీళ్లు విడుతురు, గాని వారిని ఓదార్చేవారు ఎవరూ ఉండరు. అణచివేసేవారి పక్షంలో అధికారమంతా ఉంటుంది. అణచివేయబడుతున్నవానికి న్యాయ విచారణ క్రమముగా జరుగదు. తమ స్వతంత్ర్యాన్ని తాము కోల్పోయినవారి కంటె చచ్చినవారే ధన్యులన్నట్టు సొలొమోనుకు తోచిందట. 3వ వచనం యిలా అంటుంది, “ఇంకను పుట్టనివారు సూర్యునిక్రింద జరుగు అన్యాయపు పనులు చూచియుండని హేతువుచేత ఈ ఉభయులకంటెను వారే ధన్యులనుకొంటిని.” అణచబడినవారు సంతుష్టులై ఉండాలంటే, ఆ సంతుష్టి మానసిక స్థితియై ఉండాలి. ఎందుకంటే తమ పరిస్థితులను మెరుగుపరచుకొనడానికి వారేమియు చేయలేరు.

కష్టపడిన పనిగాని, సోమరితనం గాని సంతోషాన్ని పుట్టించదు (4:4–6). తన జీవితమంతా కష్టపడి పని చేసిన ఒకని నీ మనస్సులో చిత్రించుకో. అతనికి సహజ ప్రోత్సాహము, ఉత్సాహములున్నాయి. అతనికి ఉన్నతమైన గమ్యాలున్నాయి, అతడు వాటిని చేరుకున్నాడు. అది అతని సంతోషానికి గ్యారంటీ యిస్తుందా? లేదు! తన పొరుగువారు అతని చూచి వ్యసనపడసాగారు, అది అతని సంతోషాన్ని దోచుకొంది. విజయమును అసూయ ఎదుర్కొన్నప్పుడు, స్నేహితులు దూరమయ్యారు. విజయము స్నేహితులను కోల్పోయేటంత విలువైనదా?

సోమరితనం సమస్యకు జవాబు కానేరదు. అది కూడ నాశనాన్నే పుట్టిస్తుంది. జీవితం వ్యర్థంగాను కలతతోను ఉందంటే ఆశ్చర్యపోనవసరం లేదు. దీనికి తీర్మానమేమి? దుఃఖముతోను కలతతోను రెండు చేతులనిండా ఉండుటకంటే, ఒక చేతి నిండ సమాధానంగా ఉండుట శ్రేష్ఠం. ఇది అవివేకియొక్క పరిశీలనయా లేక సొలొమోను యొక్క తీర్మానమా? ఇది ఎటు చూచినా, మనకు అందించబడే పాఠం అదే. సంతోషం పొందాలని పనిచేసి దాని సంపాదించుకోలేము సరిగదా, సోమరిగా కూర్చుండి దానికొరకు వేచియుండియు దాని పొందలేము. అటు అధికమైనదిగాని, యిటు సోమరితనంగాని కోరదగినది కాదు. అమితములనుండి దూరంగా తొలిగిపోవాలి. విజయాన్ని గూర్చి ఆందోళన చెందకుండ, దేవుని కొరకు ఆనందంగా మనం అనుదినం జీవించాలి. మనకు రెండు చేతులనిండా ఉందా, లేక ఒక చేతిలోనా లేక ఏమీ లేదా

అనేదాని గూర్చి మనం అక్కర కలిగియుండ కూడదు.

దురాశ సంతుష్టిని లయపరచుతుంది (4:7-12). మరో మనిషిని నీ మనస్సులో చిత్రించుకో – తనకు కలిగియున్నదానితో ఎన్నడూ సంతృప్తి పడనివాడు. అతడు ఒంటరిగా జీవిస్తాడు. అయినను అతడు ఎడతెగక కష్టపడతాడు, అతని కన్ను ఐశ్వర్యంతో తృప్తిపొందదు. అతనికి సహోదరుడు లేడు, కుమారుడు లేడు, స్నేహితుడులేడు. ఎవనికొరకు యిలా కష్టపడుతున్నాడో కూడ పట్టించుకోడు. తాను సంపాదించినది అనుభవించడు. దానిని ఎవనితోనూ పంచుకోడు.

స్వార్థపరమైన జీవితం అవివేక జీవితమే. మనుష్యుడు ఒంటరిగా ఉండడం మంచిది కాదు. ఈ వాస్తవాన్ని తొలిగా ప్రకటించినవాడు దేవుడే (ఆది. 2:18) “ఒంటిగాడై యుండుటకంటె ఇద్దరు కూడియుండుట మేలు” అనడానికి సొలొమోను నాలుగు కారణాలిచ్చాడు: (1) వారు తమ కష్టార్జితాన్ని పంచుకోగలరు. (2) ఒకడు పడిపోతే మరొకడు లేపుతాడు; ఒంటిగాడు పడిపోతే వానికి శ్రమయే కలుగును. (3) ఇద్దరు కలిసి పండుకొనినయెడల వారికి వెట్టకలుగును. (4) ఒంటరియగు నొకనిమీద మరి యొకడు పడినయెడల యిద్దరు కూడి వాని నెదిరింపగలరు. ఒక పేట త్రాడు సులభముగా తెగుతుంది; “మూడు పేటల త్రాడు త్వరగా తెగిపోదు గదా” (4:12).

అధికారం సహితం సంతుష్టిని గ్యారంటీ యివ్వలేదు (4:13-16). అధికారపు అంతస్థులవలన సంతుష్టి కలుగుతుందని కొందరు వాటికొరకు ప్రాకులాడతారు. ఆలోచనను అంగీకరింపని ముసలి రాజుకంటె పేదవాడైన, వివేకియైన యువకుడు శ్రేష్ఠుడు. ఆలాటి యువకుడు, పేదవాడుగా జన్మించినా, చెరలోనుండి వచ్చి రాజు కాగలడు. వేలకొలది మంది జనులు అతనిని ఊరేగించి సింహాసనముపై అభిషేకింతురు. ఈ యువకుడు కొంతకాలమువరకు శక్తిమంతుడై ప్రజాభిమానమును పొందగలడు. తరువాత రెండవ తరమువాడు సింహాసనమున్కై ఎదుగును అతడు కూడ కొంత కాలమునకు ప్రజాభిమానము పోగొట్టుకొనును. మరొక యువకుడు అతని స్థానమున సింహాసనము నధిష్టించును. అధికారము, కీర్తి జీవితానికి అర్థాన్నివ్వవు అదంతా సుడిగాలిని వెంటాడుట లాంటిది.

## ముగింపు

క్రీస్తు ప్రభువును మనం ఎరుగగలిగినందుకు దేవునికి స్తోత్రము! రక్షకుని అవసరతను గూర్చి సొలొమోను రచన నొక్కి పలుకుతుంది. మనలను రక్షించుకొనుటయనే ముచ్చట ప్రక్కనుంచి, మనలను మనమే సంతోషంగా ఉంచుకోలేము. క్రీస్తునందు వ్యర్థమైన జీవితం నిరర్థకం అవుతుంది. వ్యర్థతను గూర్చి క్రీస్తు ఎన్నడూ మాట్లాడలేదు. ఆయన నిరీక్షణ, ఆనందము, ప్రేమ, సమాధానము అనేవాటిని గూర్చి మాట్లాడారు. మనకు జీవము కలుగునట్లును అది సమృద్ధిగా కలుగునట్లును ఆయన వచ్చియున్నారు (యోహాను 10:10).

క్రీస్తుయేసునందు విశ్వాసముంచుము. ఆయన మార్గమును నీ జీవితం కొరకు అంగీకరించు. నీ జీవితంలో ఆయన కలిగించే మార్పులకు నీవు ముగ్ధుడవౌతావు.